# ఎవరికెవరు?

రంగారెడ్డి జిల్లా కలక్టర్ కారు స్పీడుగా వచ్చి రవీంద్ర భారతి ప్రాంగణంలో ఆగింది.

ఆగిన అంబాసిడర్ కార్లోంచి కలక్టర్ నిఖిల్ దిగగానే ఎదురైన కార్యక్రమ నిర్వాహకులు సాదర ఆహ్వానం పలికేరు.

రాజకీయ నాయకులెవ్వరినీ ఈ కార్యక్రమానికి పిలవక పోవటం ఆశ్చర్య మన్పించింది నిఖిల్‌కి.

అప్పటికే విచ్చేసిన ప్రేక్షకులతో రవీంద్ర భారతి ఆడోటోరియం క్రిక్కిరిసింది.

ముందు వరుసలో నిఖిల్ కోసం ప్రత్యేకించి కేటాయించిన సీట్లో తను కూర్చున్నాడు.

పన్నెండేళ్ల లోపు వయసున్న బాల బాలికలకు రాష్ట్ర స్థాయి సంగీత పోటీలు నిర్వహింప బడుతున్న కార్యక్రమానికి తనను సభాధ్యక్షుడిగా ఆహ్వానించినందుకు చాలా ఆనందపడ్డాడు నిఖిల్.

తానూ చిన్నతనంలో ఎన్నో పాటల పోటీల్లో పాల్గొని బహుమతులు గెల్చుకున్నాడు. సంగీతం ప్రత్యేకించి నేర్చుకోకపోయినా... ఒక్కసారి పాటవింటే చాలు శృతిలయ తప్పకుండా యధా తథంగా పాడగల స్వరతాళ జ్ఞానం వుండటాన... ఎలాంటి పాటనైనా ఒకటి రెండు సార్ల రిహార్సల్స్ చేసుకుని.. పాట పాడి ఎంతటి వారినైనా మెప్పించగల నేర్పరితనం తనలో వుంది.

దూరదర్శన్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి పాటల పోటీలో ఒకసారి పాల్గొని పాతికవేల రూపాయల క్యాష్ బహుమతి.. బంగారు పతకాన్ని కైవశం చేసుకున్నాడు నిఖిల్. తన స్వరం విన్న వారంతా ముగ్దులై తనను అభినందించి ఆకాశానికెత్తేశారు.

తను చదివే కాన్వెంట్‌లో సరే సరి. ప్రతి ఏటా సంగీతపు పోటీల్లో ప్రథమ బహుమతి తనదే!

తండ్రి నాగేందర్‌కి నిఖిల్ కలక్టర్ కావాలని కోరిక! పాటల పిచ్చితో కొడుకు చదువు ఎక్కడ పాడవుతుందోని మధనపడు తూండేవాడు. కానీ... నిఖిల్ ఎప్పుడూ స్కూల్ ఫస్ట్ రావటం మూలాన రానురాను తండ్రి మనసులో భయం దూరమౌతూ వచ్చింది.

టెన్త్‌లో స్టేట్ ఫస్ట్ రావటంతో పాటలు పాడే వ్యాపకానికి తనకు తానుగ గుడ్‌బై చెప్పి ఇంటర్లో చేరాడు నిఖిల్.

అయిదుగురు మగ పిల్లలు పుట్టి పోగా ఆరవ వాడు పుట్టి బతికి బట్ట కట్టింది నిఖిల్ కావటం వల్ల కన్నవారికి నిఖిల్ గారాబు బిడ్డైనాడు.

నిఖిల్ పి.జి. చేస్తున్నరోజుల్లో తల్లి హఠాత్తుగ కన్నుమూయటం జరిగింది.

ఐ.ఎ.ఎస్.కి సెలక్టయి ట్రెయినింగ్‌లో వున్నప్పటి నుండి నాగేందర్ కొడుక్కి పెళ్లి సంబంధాలు చూడసాగాడు. తండ్రికి వచ్చిన ప్రతి సంబంధాన్నీ కాదంటూ వచ్చాడు నిఖిల్.

చీఫ్ ఇంజనీర్ చేసి రిటైరైన నాగేందర్ లంకంత ఇంట్లో వంటరివాడు కావటం వల్ల తీరని అసంతృప్తి ఆయన్ను వేధించసాగింది.

నిఖిల్ వివాహ విషయంలో ఎందుకు విముఖత చూపుతున్నాడో నాగేందర్‌కి బోధపడటం లేదు. కొడుకు పెళ్లి జరిపించకుండా తనూ కన్నుమూస్తే నిఖిల్ వంటరివాడౌతాడు. ఒక్కగా నొక్కకొడుకు ఆలనా పాలన ఎవరు చూస్తారనే దిగులు నాగేందర్‌ని పీక్కుతింటొంది. ట్రైనింగ్ పూర్తయి పోస్టింగ్ అందుకునే నాటికి అకస్మాత్‌గ తండ్రి కూడా కన్ను మూయటం వలన కొండంత వేదన కలిగింది.

మైక్‌లో కార్యక్రమం వెంటనే ప్రారంభం కానున్నదనే ప్రకటనవిన్న నిఖిల్ గత స్మృతుల నుండి తేరుకున్నాడు.

తెరతొలిగింది!

నిఖిల్‌ని వేదిక మీదకు ఆహ్వానించారు. తనతో పాటు ప్రముఖ గాయని..సంగీత సామ్రాజ్ఞి అయిన సుష్మాని కూడా ఆహ్వానించటంతో ఆమె వచ్చి కలక్టర్ నిఖిల్ పక్కగా వున్న కుర్చీలో కూర్చుంది.

ఆనాటి కార్యక్రమ వివరాలను అసోసియేషన్ కార్యదర్శి మైక్ ముందుకొచ్చి ప్రేక్షకులనుద్దేశించి మాట్లాడి తెలియపరిచారు.

తరువాతగ సభాధ్యక్ష స్థానంలో వున్న జిల్లా కలెక్టర్ నిఖిల్ తాను కూర్చున్న కుర్చీలో నుండి లేచి నిలబడి... ఈ విధంగా రాష్ట్రస్థాయి పోటీలను ఈ సంస్థ క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం నిర్వహించి బాలబాలికలకు బహుమతులను అందివ్వటంలో గల ముఖ్య వుద్దేశం పిల్లల్లో దాగివున్న కళను వెలికి తీసి ప్రోత్సహించాలనేది ముఖ్య ఉద్దేశమన్నాడు. పిల్లలను వారి తల్లి తండ్రులు కూడా ప్రోత్సహించాలని హితవు పలికాడు. చిన్న నాటి విషయాలను గుర్తు చేసుకుంటూ తనకూ పాటల పట్ల ఆసక్తి వున్నదని ఎన్నో పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్నాననీ... చెప్పటంతో చప్పట్లతో రవీంద్ర భారతి ఆడిటోరియం మార్మోగింది.

ఈ నాటి పాటల పోటీకి ప్రముఖ గాయనీ సుష్మగారు న్యాయ నిర్ణేతగా వ్యవహరించటం ముదావహమంటూ ప్రస్తుతించాడు నిఖిల్.

జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ముగిసేక పాటలపోటీల కార్యక్రమం మొదలైంది.

నిఖిల్ సుష్మలు స్టేజి దిగివచ్చి వారి వారి సీట్లలో ఆశీనులైనారు.

సీట్లో కూర్చున్నాడన్న మాటేగాని.. నిఖిల్ మనస్సంతా గందర గోళంగా వుంది. ఎడతెరిపి లేని ఆలోచనలు అతడిని కలవర పెడుతున్నాయ్.

మళ్లీ చిన్ననాటి జ్ఞాపకాల దొంతరలు నిఖిల్ మనసులో ముసురుకున్నాయ్.

చిన్నప్పుడూ తాము మేడమీది భాగంలో వుంటే.. క్రింది భాగంలో వుంటే సంగీతం టీచరు రుక్మిణి బాయమ్మ గారి అమ్మాయి చిట్టి తను చదివే కాన్వెంట్‌లోనే చదువు తున్న కారణాన ఇద్దరూ కలిసి స్కూలుకు వెళ్లేవారు.

తల్లి మ్యూజిక్ టీచర్ కావటం వల్ల రోజూ కూతురు చిట్టికి సంగీతం పాఠాలునేర్పు తుంటే నిఖిల్ కూడా వెళ్లి కూర్చుని నేర్చుకునేవాడు. స్కూల్లో ఇద్దరికీ రెండు క్లాసులు తేడా.. అంతే! వయసులోనూ రెండేళ్ల వ్యత్యాసం వుంది.

చిట్టి అంత చిన్న వయసులో శ్రావ్యంగా పాటలు పాడుతూంటే మళ్లీ మళ్లీ వినాలన్పించేది తనకు. స్కూల్లో కూడా ఇద్దరూ కలిసి జంటగ పాటలు పాడేవాళ్లు. మొదటి బహుమతికి పోటీ పడే వాళ్లు!

చిట్టి అంటే తనకెంతో అభిమానం. ఇద్దరి అభిరుచులు ఒక్కటే! ఇరువురూ చదువులో ఫస్టే!

తనతో అన్యోన్యంగా మెలిగే చిట్టి స్నేహాన్ని తాను ఎన్నటికీ మర్చిపోలేడు. చిట్టి ఎప్పుడూ తనకు తోడుగ తనవెంటే వుండాలని కోరుకునే వాడు. ఒక్క రోజు ఏ కారణం చేతనైనా చిట్టి కన్పడకపోతే.. తన మనసులో ఏదోవెలితి..అర్థంకాని దిగులు చోటు చేసుకునేది.

ఒకసారి పాల్గొన్న పాటల పోటీలో మొదటి బహుమతి ఇద్దరికీ చెరి సగం పంచి ఇచ్చారు. "ఇద్దరికీ మార్కులు సరిసమానగం వచ్చినయ్. బంగారు పతకాలు... క్యాష్ ప్రైజుమనీ అందుకున్న క్షణాన ఇద్దరూ కౌగిలించుకున్నారు. ఒకరినొకరు ముద్దాడుకున్నారు.

వీరిద్దరి అన్యోన్యతకు నిర్వాహకులు.. న్యాయనిర్ణేతలు నివ్వెరపోయినా... వారి ఆశీస్సులు అందించారు.

చిట్టి పట్ల తెలీని మమత ఆప్యాయత నిఖిల్ పసి మనసులో బలీయంగ పీఠం వేసుకున్నయ్.

తాను పెద్దయ్యాక చిట్టిలాంటి పిల్లనేపెళ్లి చేసుకోవాలనుకున్నాడు. ఛ...ఛ! చిట్టిలాంటిది కాదు... తప్పక చిట్టినే పెళ్లాడాలని నిర్ణయించుకున్నాడు నిఖిల్.

టెన్త్ రిజల్ట్స్ వచ్చాక డాడీకి ట్రాన్స్ఫర్ అయిన కారణాన తాను వేరేవూరు వెళ్లిపోవలసి వచ్చింది.

అప్పటి నుండి... ఎన్ని సార్లు చిట్టి జ్ఞాపకానికి వచ్చినా కలవగల అవకాశం లేకపోయింది. ఆ తర్వాత చదువులో శ్రద్ధ చూపాల్సిన అవసరంతో మనసంతా స్టడీస్ మీదే లగ్నమైంది.

అయినా తాను చిట్టిని మర్చిపోలేదు. పోలేడు. ఎప్పటికైనా చిట్టిని కలవగలననే ఆశ నిఖిల్ మనసులో బలంగాపీఠం వేసుకుంది. ఆ కారణంగానే తన పెళ్లి పోస్ట్‌పోన్ చేస్తూ వచ్చాడు. ఈ రహస్యం బైటికి ఎవరికీ చెప్పకుండా మనసులోనే గుప్తంగా దాచుకున్నాడు ఇన్నేళ్లూ!

పాటల పోటీ ముగిసిందంటూ తర్వాత కార్యక్రమం వెంటనే ప్రారంభమౌతుందనే ఎనౌన్స్‌మెంట్ రాగానే గత స్మృతుల నుండి తెప్పరిల్లుకున్న నిఖిల్ ప్రస్తుతంలోకి వచ్చాడు.

మరల వేదిక మీదికి నిఖిల్ సుష్మగారలను ఆహ్వానించటం జరిగింది.

ఎన్నో కార్యక్రమాలున్నప్పటికీ మా అభ్యర్థన మన్నించి సుష్మగారు న్యాయనిర్ణేతగా వ్యవహరించటానికి ఈపాటల పోటీకి విచ్చేయటం మాకు మహదానందంగావుంది. పోటీలో పాల్గొన్న బాలబాలికలలో బహుమతి గ్రహీత లెవరో అనౌన్స్ చేయటానికి ముందుగ... ఉడుతాభక్తిగ ప్రముఖ గాయని సుష్మగారికి సన్మాన కార్యక్రమం ప్రారంభమౌతోంది. అసోసియేషన్ క్యాదర్శి మైక్‌లో ఎనౌన్స్ చేయడం జరిగింది.

సుష్మకి సన్మానం నిఖిల్ చేతుల మీదుగా జరుగ నారంభమైంది.

ఆమె నుదుటన తిలకందిద్ది గంధంచెంపలకు రాసి... పన్నీరు చల్లి.. శాలువ కప్పి... మెడలో దండ నిఖిల్ వేస్తుండగ చప్పట్లతో హాలు ప్రతిధ్వనించింది.

కార్యక్రమం ముగిసేక నిఖిల్ సుష్మలు వేదికదిగి తమకు కేటాయించిన సీట్లలో పక్కపక్కగ ఆశీనులైనారు.

సుష్మ గురించి తెలుసుకుని ఆమెను స్వయంగా తన చేతులతో సన్మానిస్తున్న క్షణాల్లో ఆమె చిన్ననాటి మిత్రురాలు చిట్టి అయివుంటుందన్పించింది నిఖిల్‌కి.

చిట్టి కూడా ఇప్పటికి ఇంతగ సుష్మలా ఎదిగి వుండాలి! సుష్మలా ప్రముఖ గాయనీమణి అయి వుండాలి... పేరు ప్రఖ్యాతులు ఆర్జించి వుండాలన్పించింది.

సుష్మ తప్పక చిట్టే అయివుంటుంది! ఎప్పుడో కొన్ని ఏళ్ల క్రితం కల్సుకుని చదువుకున్న తాము ఇన్నేళ్ల తర్వాత ఒకరినొకరు గుర్తించుకోలేక పోతున్నామేమో అన్పించింది నిఖిల్‌కి!

బహుమతి ప్రధానం ముగిసే లోపు సుష్మను తన బంగళాకి డిన్నర్‌కి రావలసిందిగా కోరాడు నిఖిల్. కలక్టర్ హోదాలో వున్న నిఖిల్ కోరికను కాదన్లేకపోయింది సుష్మ!

కార్యక్రమం ముగిసేక నికిల్ సుష్మలు ఇద్దరూ అంబాసిడర్ కార్లో కలక్టర్ బంగళా చేరుకున్నారు.

ఇరువురు బంగళాలోకి నడిచారు.

'కమాన్... అలా కూర్చోండి! నేను డ్రెస్ ఛేంజ్ చేసుకొస్తాను'.

ఈ లోపుగా గోడకు వ్రేలాడే ఫోటోలను తిలకిస్తూ మౌనంగా వుండిపోయింది సుష్మ.

ముఖ్యమంత్రితో దిగినవి... మొక్కలు నాటే కార్యక్రమంలో తీసినవి. .. అభినందన పత్రాలు... వాటి పైన పాతికవేల రూపాయల చెక్ జిరాక్స్ కాపీ ఫ్రేముతో గోడకు వేలాడుతూండటం చూచి నివ్వరపోయింది.

ఇంతలో నైట్ డ్రెస్‌లో అక్కడి కొచ్చిన నిఖిల్ 'ఆ ఫోటో చూస్తూంటే మీకేం గుర్తు రావటం లేదా? అంటూ అడిగాడు.

గుర్తుకు రావటం లేదనే భావనతో తల అడ్డంగ ఆడించింది సుష్మ.

ఇంకా గతం గుర్తుకు రానందుకు ఫీలైనాడునిఖిల్.

'మీ పేరు ... చిట్టి కదూ?' సూటిగా ప్రశ్నించాడు

'నో! కాదు..సుష్మ!!-

'అది మీ అసలు పేరు కాదు. కానీ ముద్దు పేరుతో చిన్నప్పుడు మీ ఇంట్లో అందరూ... నేను కూడా చిట్టీ అని పిలిచేవారం...గుర్తు లేదూ?.. మర్చిపోయారా?...''సుష్మ కళ్లల్లోకి తీవ్రంగా చూస్తూ అన్నాడు.

ఇంతలో కుక్ వచ్చి 'సార్... భోజనం వడ్డించమంటారా..?' అడిగాడు.

'నువ్వు కిచన్‌లో పని చూసుకుని వెళ్లి పడుకో! మేం వడ్డించుకుంటాం. చెప్పాడు నిఖిల్.

'సార్.. పదార్థాలన్నీ డైనింగ్ టేబుల్ మీదే పెట్టాను...' అని చెప్పి లోపలికి నడిచాడు కుక్.

'కమాన్ అనేసి ఇద్దరూ డైనింగ్ టేబుల్ వైపు నడిచారు.

ఎదురెదురు సీట్లల కూర్చుని వడ్డించుకోవటంలో నిమగ్నమైనారు.

'నేను.. మీమమ్మీ ఆశించిన విధంగా నువ్వు ప్రముఖ గాయనివైనందుకు నాకెంతో ఆనందంగా వుంది చిట్టీ.

తనను చిట్టీ అన్నందుకు ఈ సారి నిఖిల్‌ను వారించదల్చుకోలేదు సుష్మ.

మనం కల్సుకోవడం యాదృచ్ఛికమే అయినా... నా కెంతో సంబరంగ... తృప్తిగ... హాయిగావుంది చిట్టీ...

పదేపదే తనను 'చిట్టీ' అని సంభోదించటంలోగల కారణమేమైవుంటుందాని ఆలోచించినా సుష్మకు అంతుచిక్కలేదు.

'బైదిబై... ఇందాక ఆ జిరాక్స్ కాపీ చెక్ వున్న ఫోటో ఎక్కడిదనికదూ అడిగావు. గతం నువ్వు మరచినా... ఆ మధురమైన స్మృతి నా మనో ఫలకంపై చెరగని ముద్ర వేసుకుంది. ఎంచేతో చెప్పనా? - ఐ మీన్ గుర్తు చేయనా.. పోటీలో పాల్గొన్న మనిద్దరికీ మార్కులు

సమానంగా వచ్చినయ్. మనిద్దరిలో ఫస్ట్ ఎవరో సెకండ్ ఎవరో తేల్చటం జడ్జస్ వల్లకాలేదు. అందుకే బహుమతి యాభైవేల రూపాయల మొత్తాన్ని రెండు పాతికవేల రూపాయల చెక్కులుగా డివైడ్‌చేసి ఇద్దరికీ సరిసమానంగ ఇచ్చారు. మహదానందంతో ఇద్దరం ముద్దులుపెట్టుకున్నాం. గుర్తుందా? అవున్లే... అడవాళ్లు గతాన్ని బహుతేలిగ్గా మర్చిపోతారు.' నిఖిల్ మాటల్లో నిష్ఠూరం ధ్వనించింది.

సుష్మకి పరిస్థితి అర్థమైంది. నిఖిల్ నేరేట్ చేసిన గతాన్ని గుర్తుకు తెచ్చుకుంది.

'అవును ఫ్రెండూ! ఇది జరిగి చాలా ఏళ్లు అయిందికదా.. వెంటనే గుర్తుకు రాలేదు. ఐయామ్ సోసారీ...' అంది

'నో..నో...నో!

'నన్ను చిట్టీ అని పిలిచే హక్కు అధికారం నీ వక్కడికే వుంది నిఖిల్...' పరిస్థితి అర్థం చేసుకున్న సుష్మ సమర్థిస్తూ మాట్లాడింది.

'అవును... నువ్ మేరేజ్ చేసుకున్నావా?- తలెత్తి ముఖంలోకి చూస్తూ ప్రశ్నించాడు నిఖిల్.

సమాధానం ఎలా చెప్పాలో అర్థం కాక ఇరకాటంలో పడింది.

'నేను మాత్రం బాచ్‌లర్‌గానే నీ తీపి జ్ఞాపకాలతో ఇలా వుండి పోయాను. ఎప్పటికైనా నిన్నే పెళ్లి చేసుకోవాలని తీర్మానించుకున్న నాకు.. ఇన్నేళ్లకి నువ్వు నాకు అవుపించావ్... ఈ అద్భుతమైన రోజుని ఎన్నటికీ మరువలేను చిట్టీ..' నిఖిల్ స్వరంలో ఉద్రేకం ఉద్వేగం చోటు చేసుకున్నాయ్.

సుష్మ మౌనం వహించింది.

'నా ప్రశ్నకు నువ్ బదులివ్వనేలేదు...'

ఏ ప్రశ్నకు అన్న భావనతో నిఖిల్ కళ్లల్లోకి అదోలా చూసింది.

ఇద్దరూ డిన్నర్ ముగించారు.

'ఈ ప్రపంచంలో నాకెవ్వరూ లేరు చిట్టీ నువ్ తప్ప! నా ఆరాటం...ఆరాధన...అన్నీ నువ్వే!- నువ్ యస్సంటే... ఐ యామ్ సారీ...' చెప్పాలనుకున్నది చెప్పలేక మాటలకు బ్రేక్ వేశాడు.

'మనం బయల్దేరుదాం!-బాగా పొద్దుపోయింది-నన్ను మా యింటిదాకా డ్రాప్ చేయరూ... ప్లీజ్...అద్భుతమైన డిన్నర్ మీ బంగళాలో ఆరేంజ్ చేసినందుకు నామనః పూర్వక దన్యవాదాలు...'

'నో నాటెటాల్! - పద ... నిన్ను డ్రాప్ చేసొస్తాను...' అన్నాడు.

బైటికొచ్చి ఇద్దరూ కారెక్కారు!

డ్రైవింగ్ సీట్లో నిఖిల్! పక్కగా సుష్మ!!

కారు మలుపులు తిరుగుతూ వేగంగా పరుగెడుతోంది.

ఇద్దరి మధ్య మౌనం... భయంకర నిశిరాత్రిలావుంది.

'ఏంటి చిట్టి సైలెంట్‌గా వున్నావ్. చాలా కాలానికి కలుసుకున్నందుకు వైలెంట్‌గా వుంటావనుకున్నాను'. డ్రైవ్ చేస్తూ తలపక్కకైనా తిప్పకుండా అడిగాడు.

'మీ ప్రేమ... ఆరాదన భావం.. అప్యాయత... అనురాగం... ఇంకా... ఇంకా... మీ మనసులో దాగిన ఎన్నింటినో అర్థం చేసుకున్నాను. బట్‌వన్‌థింగ్ -' చెప్తూ ఆగింది.

తన ప్రశ్నకు ఫైనల్‌గా జవాబు ఇవ్వబోతోందని గ్రహించాడు నిఖిల్.

మిమ్మల్ని దక్కించుకోలేక పోతున్న దురదృష్టవంతురాలను. అందుకు సారీ...

'అంటే?'

'సారీ ఫ్రెండ్! మీరనుకుంటున్నట్టు... నేను మీ చిట్టిని కాను.. చిట్టి నా చెల్లెలు. అదీ నేను కవలలం. పూరిటిలోనే నన్ను మా పెద్దమ్మ తీసుకెళ్లి పెంచి పెద్ద చేసింది. నా అభిలాష గమనించి నాకు సంగీతం నేర్పించదింది పెద్దమ్మ. లక్కీగా నా సిస్టర్ చిట్టి కూడా సంగీతం అబ్బిందీ. ఇద్దరం ఒకే తల్లికి పుట్టిన కవలలం కదా..' చెప్తూ ఆగింది.

కారుకి సడన్ బ్రేకు పడింది! రోడ్డుకు అడ్డంగాకుక్కపిల్ల రావడంతో నిఖిల్ కారు ఆపాడు.

అతని ముఖంలో రంగులు మారాయి. తీరని అసంతృప్తి.... వేదన మనసులో చోటు చేసుకున్నాయ్.

మళ్లీ కారు స్టార్ట్ అయింది

సుష్మ మళ్లీ చెప్పటం ప్రారంభించింది.

నా చిట్టి మీకు అత్యంత ఆత్మీయురాలనే నిజాన్ని గ్రహించాను. ఆమెనే ఆరాధిస్తూ అమె కోసమే మీ జీవితాన్ని వంటరి చేసుకున్నారని తెల్సుకున్నాను. ఏం చెప్పను? - నా చెల్లెలు చిట్టి బి.ఎ. ఫైనలియర్ ఎగ్జామ్స్ రాసి ఇంటికొస్తుండగా లారీ యాక్సిడెంట్‌కు గురై కన్ను మూసింది. విధి వక్రించింది. దాని జీవితం అలా అర్థాంతరంగా ముగిసినందుకు మేమంతా ఎంతో బాధపడ్డాం. ఇద్దరం ఒకే పోలికలో వున్నవాళ్లం కనుక నన్ను మీ ఫ్రెండ్ చిట్టిఅనుకుని భ్రమించారు. ఆ! కారు ఆ పండి...అదే మా బంగళా.. నాభర్త లీడింగ్ డాక్టర్.. అవకాశం వున్నప్పుడు మళ్లీ కలుద్దాం'... బై చెప్పి కారుదిగి బంగళాగేటు తీసుకులోనికి వెళ్లింది సుష్మ.

అశృపూరిత నయనాలు తుడుచుకుని బరువెక్కిన గుండెతో వెనక్కుతిరిగాడు నిఖిల్!!!

-:(సమాప్తం):-